
# 'చేజారిన అదృష్టం'

- బి. సత్యనారాయణ



సామాన్య కుటుంబంలో పుట్టిన రాజు బ్రతుకు తెరువుకోసం, ప్రభుత్వ వుద్యోగం కాకపోయినా, దాదాపు అదే జీతంతో ప్రైవేటు గుమాస్తాగా తన బ్రతుకు బండిని అతి కష్టంగా లాగుతున్నాడు. అతని సమస్యలు అతని అడుగుజాడలలో కాకుండా, నాలుగడుగులు ముందే వేస్తున్నాయి.

ముసలి తల్లిదండ్రులతోపాటు, భర్త వదిలేసిన అక్క, ఆమె కొడుకు, వీళ్ళతోపాటు వుద్యోగ వేటలో పోటీపడుతున్న కొడుకు, పెళ్ళి కావలసిన కూతురు; తండ్రికి వచ్చే పెన్షన్ వాళ్ళిద్దరి మందుల ఖర్చులకు సరిపోవు, వూళ్ళో వున్న యిల్లు అమ్మి అక్క పెళ్ళి కానిస్తే బావ దురలవాట్లకు లోనై అక్కని, మేనల్లుని పుట్టింటికి పంపేశాడు. వూళ్ళో వున్న పొలంలో పండే బియ్యం తెప్పించుకొని అందరు రాజుతోనే విజయవాడలో అద్దె యింట్లో వుంటున్నారు.

రాజు కొడుకు కూడా పదిమంది పిల్లలకు ట్యూషన్స్ చెప్పి వచ్చే ఆదాయం యింట్లో యిస్తూ తండ్రికి చేదోడు వాదోడుగా వుంటున్నాడు. యిక కూతురుకి వచ్చే సంబంధాల వాళ్ళు కట్నం విషయంలో మొహమాటం పడకుండా అడిగేసరికి ఆ ప్రయత్నాలకు దూరంగా వున్నాడు రాజు.

రాజు భార్య కుట్టుమిషన్‌పై వచ్చే ఆదాయం కూడా ఆ కుటుంబం ఖర్చులకు సరిపోవడంలేదు.

రాజు చేసే వుద్యోగ రీత్యా, అప్పుడప్పుడు క్యాంపులకు కూడా వెళ్ళాల్సి వచ్చేది. క్యాంపులకు వెళ్ళినప్పుడు మందు, పేకాట కూడా రాజుకు వ్యసనమైంది. కుటుంబ సమస్యలతోపాటు యీ ఖర్చు అదనంగా చేరింది.

రాజు ఆఫీసు పనిమీద అర్జంట్‌గా హైదరాబాద్ వెళ్ళి రావల్సి వచ్చింది, క్యాంపులకు వెళ్ళినప్పుడల్లా నాలుగైదు వందలు మిగులుతాయి. అందుకే రాజు ఆ రాత్రి ఎక్స్‌ప్రెస్ ట్రైన్లో హైదరాబాద్ బయలుదేరాడు. ట్రైన్‌లో కూర్చున్న రాజుకి తన కుటుంబ సమస్యలను నెమరువేసుకుంటూ కునికిపాట్లు పడుతున్నాడు.

ఎప్పుడు నిద్ర పట్టిందో ఏమో, మేల్కవచ్చేసరికి ట్రైన్ నాంపల్లి స్టేషన్లో ఆగింది. స్టేషన్లో వచ్చేపోయే ప్రయాణికులతో హాకర్ల కేకలతో, కూలీల హడావుడితో కోలాహలంతో ప్లాట్‌ఫారాలన్నీ బిజీబిజీగా వున్నాయి. ట్రైన్ దిగి స్టేషన్‌లోనే కాలకృత్యాలు తీర్చుకొని బయటకొచ్చాడు.

స్టేషన్ బయట ఒక్క ఆటో కనబడలేదు. టైంచూసి బయట పాన్‌షాపులో ఆ రోజు పేపరు కొని, సిగరెట్ వెలిగించి పాన్‌షాపు వాడితో "ఏమండి, ఒక్క ఆటోకూడా కనబడటం లేదు ఏమైంది...?!" అన్నాడు రాజు.

మొన్న ఆటో వాళ్ళకి, ఆర్‌టిసి వాళ్ళకు గొడవైంది సార్. ఆటోవాళ్ళు రెండురోజుల నుండి స్ట్రైక్ చేస్తున్నారు, చెప్పాడు షాపువాడు.

రాజు కొంతదూరం రిలాక్స్‌కోసం నడిచాడు. వెనుక నుండి సైకిల్ రిక్షా వచ్చి తన ప్రక్కనే ఆగింది. "బాబూ రిచ్చా కావాలా?" అని వినబడింది.

అస్థిపంజరం లాంటి ఓ మానవాకారం, అతని బ్రతుకు లాగే చినిగిన చొక్కా, మాసిన గడ్డం, తలపై ఎండ తగలకుండా పాత టోపి, సుమారు 50, 55 సం. శాల్తి కనబడింది.

అతని వాలకం గమనించి చార్మినార్‌కు వస్తావా? అన్నాడు.

'ఎంతోకొంత యిప్పించండి బాబూ, మీకు తెలియదా బాబూ'- అంటూ, సీటుపై దుమ్ము దులిపి రాజు చేతిలో బ్రీఫ్‌కేస్ రిక్షాలో పెట్టాడు.

ముందే మాట్లాడుకుంటే మంచిదని - ఎంతిమ్మంటావు?

'బోణి బేరం బాబు, చాలా దూరం పది రూపాయిలివ్వండి...!' దీనంగా అడిగాడు రిక్షావాలా.

సరే, పద అని రిక్షా ఎక్కాడు రాజు, రిక్షావాలా రొప్పుతూ మధ్యమధ్యలో దగ్గుతూ, ప్రేగులు తెగేట్టు రిక్షా తొక్కుతున్నాడు.

రాజు పేపరు చూస్తూ అప్పుడప్పుడు రిక్షావాలాను గమనిస్తూ కూర్చున్నాడు.

రిక్షావాలా రిక్షా ఆపి పడిపోయిన రిక్షా చైన్‌ను సరిచేసి ముఖానికి పట్టిన చెమట తుడుచుకుంటూ, బాబూ, ఈరోజు పేపర్లో 'రాజ్యలచ్మి' లాటరీ గురించి వేశారా బాబు, అడిగాడు.

అప్పుడు గుర్తొచ్చి, జేబులో పర్సులో దాచిన లాటరీ టికెట్ తీసి పేపర్లో ఆ నంబరు వుందేమోనని పరిశీలించి లాభం లేదు, యీసారి కూడా కాళీ నిరుత్సాహపడ్డాడు.

రిక్షావాల ఆగి, తనవద్ద అతి జాగ్రత్తగా దాచిన లాటరీ టికెట్ తీసి, బాబూ యీ నెంబరోపాలి చూడండి. అంటూ, టికెట్ రాజు చేతికిచ్చి రిక్షా తొక్కుతున్నాడు.

రాజు టికెట్ అందుకొని, నాలాంటి వాళ్ళకు రాని ప్రైజ్, యీ రిక్షా వాడికి వస్తుందా? అని మనసులో అనుకుంటూ, పేపరు, టికెట్ పరిశీలిస్తున్నాడు, రాజు ఒక్కసారిగా వులిక్కిపడ్డాడు.

నమ్మలేకపోయాడు... యిది కలా?... నిజమా...! రెండోసారి జాగ్రత్తగా పరిశీలించాడు, ఆశ్చర్యం...! రిక్షావాలా కొన్న టికెట్‌కు ఫస్ట్ ప్రైజ్, రెండు లక్షల రూపాయలు,... తాను చూసేది నిజమేనా? ఏమీ అర్థం కావడంలేదు... ఆలోచిస్తున్నాడు- రాజు.

ఏమైంది బాబు...! ఆశగా అడిగాడు రిక్షావాల.

రాజు ఆలోచనలోనుంచి తేరుకొని- చూస్తున్నా, చూస్తున్నా అన్నాడు.

మాది రాజమండ్రి దగ్గర బాబూ, గోదారమ్మ పొంగి, వున్న గుడిసె కొట్టుకుపోవడంతో కట్టుబట్టలతో యిక్కడికొచ్చాం. ఏంటో బాబు సంపాదించినదాన్లో సాయంకాలం సగం 'సారా'కు, మిగిలినదాన్లో రిక్షా కిరాయి, తిండి తిప్పలు, దీనికితోడు రోగిష్టి భార్య, పెళ్ళికెదిగిన యిద్దరమ్మాయిలు, ఒక్కడి కష్టంతో యివన్ని బాబూ...! పేకాటలు గుర్రప్పందాలు మీలాంటి గొప్పోళ్ళకు, మరి మాలాంటి వాళ్ళకు యీ లాటరీ టికెట్లు. చానాళ్ళనుండి వారం వారం టికెట్ కొంటూనే వున్నాను. ఒక్క రూపాయి రాలేదు. అయినా మాలాంటి వాళ్ళకెందుకొస్తుంది బాబూ- అంటూ రొప్పుతూ రిక్షా తొక్కుతున్నాడు.

రాజుకు మాత్రం అతని మాటలు చెవికెక్కడంలేదు, ఏవేవో ఆలోచనలు బుర్ర వేడెక్కిస్తున్నాయి, తొందరగా గమ్యం చేరితే బాగుండునని, ఆరాట పడసాగాడు. రిక్షావాలా ఆపి, బీడీ వెలిగించి, మళ్ళీ రిక్షా తొక్కసాగాడు.

రాజు, పరిపరి విధాలా ఆలోచించసాగాడు. ఏదో యీ చిన్న వుద్యోగంపై వచ్చే ఆదాయం, తన సమస్యలు తీర్చ లేవు. ఆ విషయానికొస్తే రిక్షావాడి సమస్యలు, తన సమస్యలు ఒకటే. ముసలి తల్లిదండ్రులు, వుద్యోగం లేని కొడుకు, పెళ్ళికెదిగిన కూతురు, భర్త వదిలేసిన అక్క. యివి కాక రిక్షావాడికి వున్న వ్యసనాలు తనకు కూడా వున్నాయి. వాడు తాగితే 10 లేదా 20 రూపాయల ఖర్చు, మరి తాను ఫ్రెండ్స్‌తో కలిసి త్రాగి పేకాడితే వందలు, వేలు. రాబడి కంటే ఖర్చు ఎక్కువే. యిప్పటివరకు స్వంత గూడు లేదు, పొదుపంటే ఏమిటో తెలియని జీవితం.

నిజంగా యీ లాటరీ ప్రైజ్ మని వాడికి చెందాలి. అదృష్ట దేవత నన్ను యీ రూపంలో వరించింది. యిలాంటి అవకాశం జారవిడిస్తే నా అంతటి దరిద్రపుగొట్టు వాడెవడు వుండడు... వాడు చదువురాని దద్దమ్మ టికెట్ మార్చేస్తే మాత్రం వాడు కనిపెడ్తాడా? అంటూ ఆలోచిస్తున్నాడు.

"దేశంలో మాలాంటి దరిద్రులు ఎంతమందున్నారో బాబు, నిలువ నీడ లేక, పూట గడవక అష్టకష్టాలు పడుతున్నాము, యివి తీర్చడానికి ఎవరున్నారు బాబు," రిక్షావాలా అన్నాడు.

"పాపం, వీడికి స్వంత రిక్షాకూడా లేదు. నాకు స్వంత యిల్లు లేదు, ప్రభుత్వం ఎన్ని సంక్షేమ పథకాలు అమలు పర్చినా సమస్యలు తీరడంలేదు. వాడి టికెట్‌కే ప్రైజ్ వచ్చిందని చెపితే, వాడు నన్ను ఎంత గౌరవిస్తాడో, పాపం వాడి కష్టాలన్నీ గట్టెక్కుతాయి" ఆలోచిస్తున్నాడు రాజు.

రిక్షా గమ్యస్థానం చేరింది. రిక్షా ఆగడంతో అతని ఆలోచనలకు బ్రేక్ పడింది. రాజు రిక్షా దిగి యిదిగో నీ 'టికెట్' అంటూ తన టికెట్ వాడి చేతికిచ్చి వాడి టికెట్ పర్సులో దాచి, యిరవై రూపాయల నోటు అందించాడు.

ఆ నోటు అందుకొని, 'చిల్లర లేదు బాబు అన్నాడు పర్వాలేదు వుంచుకో' అన్నాడు రాజు.

'వద్దు బాబు, కష్టపడ్డ దానికి తగ్గ డబ్బివ్వండి, చాలు ఎక్కువొద్దు' అన్నాడు.

అతని మాటలు కొరడాతో కొట్టినట్లు ఫీలయ్యాను. వాడితో మాటలు పెంచుకోవడమెందుకని వడివడిగా బ్రీఫ్‌కేసుతో దిగి వెళ్ళాడు రాజు.

తన చేతిలోవున్న లాటరీ టికెట్‌ను, ఇరవై రూపాయల నోటును మార్చిమార్చి చూసుకుంటూ టికెట్‌ను కసితీరా ముక్కలుచేసి నేలకొట్టి, యిరవై రూపాయల నోటు జేబులోపెట్టుకొని వెళ్ళిపోయాడు. రాజు టికెట్‌ను మార్చేశాడని ఆ, అమాయకుడికేం తెలుసు...!...?

రాజు తన పని పూర్తిఅయ్యేసరికి సాయంత్రమైంది. తానెంత అదృష్టవంతుడిని, అంతా సినిమాలా జరిగింది. ఎన్నో ఆలోచనలు, రంగు రంగు కలలు, ఏదీ కనబడనట్లు ఏమీ వినబడనట్లైంది అతని పరిస్థితి. కలిసొచ్చే రోజుకు నడిసొచ్చే కొడుకు అనేది తన పట్ల రుజువైంది. టికెట్ యిక్కడే మార్చుకుంటే, అమ్మో అంత పెద్దమొత్తం తీసుకొని ఒక్కడ్నే ట్రైన్లో వెళ్ళాలంటే, తను కొన్న టికెట్టుకే ప్రైజ్ మని వచ్చినట్లు ఫీలవుతున్నాడు రాజు.

రాజు పనిచేసే ఆఫీసుకు సంబంధించి డబ్బు హైదరాబాద్‌లో ఆఫీసువారు విజయవాడ ఆఫీసులో యివ్వమని యిచ్చారు, రాజు లాటరీ ఆనందంలో ఆ డబ్బుతో వెనకా ముందు ఆలోచించకుండా అందరికి తలా ఓ జత బట్టలు ఖరీదైనవే షాపింగ్ చేశాడు. విచ్చలవిడిగా ఖర్చు చేయసాగాడు.

అదే సంతోషంలో ఆఫీసు మిత్రులకు గ్రాండ్ పార్టీ యిచ్చి ఆ రాత్రి పనిలేకున్నా మంచి లాడ్జింగ్ తీసుకొని ఫ్రెండ్స్‌తో పేకాట మొదలుపెట్టాడు. తెల్లారేసరికి తనకు పేకాటలో దాదాపు ఆఫీసు డబ్బు చాలావరకు పోయింది. ఆ సంతోషంలో యివేమీ పట్టించుకోలేదు రాజు.

అవునుమరి అదృష్టవంతుడ్ని ఎవరూ చెడగొట్టలేరు. దరిద్రుడ్ని ఎవరూ బాగుపరచలేరు. యీలోకంలో కొన్నిరోజులు చీకటి, కొన్ని రోజులు వెలుతురు. తాను మాత్రం ఎంతకాలం యీ దుర్భర జీవితం అంటిపెట్టుకోవాలి. తనకు మంచిరోజులు వస్తాయని ఎదురుచూచి, చూచి యిప్పటికి ఆ భగవంతుడికి జాలి కలిగింది.

రిక్షావాలా కూడా అతి కష్టంగా జీవితాన్ని వెళ్లబుచ్చుతూ పూట పూటకి వెదుక్కోవడం, పాపం ఎవరు ఆదుకుంటారు. ఛీ... నేనెంత నీఛంగా ప్రవర్తించాను. వాడికి వచ్చిన



ట్రైన్‌కు టైం దగ్గర పడుతుంది. బ్రీఫ్‌కేస్ సర్దుకున్నాడు. రాత్రి త్రాగడం వలన తల పట్టేసింది. రూంబాయ్‌ని పిలిచి తర్వాత ట్రైన్‌కెళ్ళొచ్చని మందు తెప్పించుకున్నాడు రాజు. రూములో ఒక్కడే నిదానంగా త్రాగుతూ. సిగరెట్ వెలిగించి. పొగను రింగులు రింగులుగా వదులుతూ. మళ్ళీ ఆలోచించసాగాడు-

అదృష్టాన్ని దక్కించుకోడానికి నేనెవర్ని...? కనీసం వాడితో ముఖ పరిచయంలేదు. వాడు మా బంధువు కాదు, వాడి సొమ్ము నేను అనుభవించే హక్కెవరిచ్చారు...! యిది చాలా అన్యాయం. అక్రమం...! దార్లో దొరికిన రూపాయి నాణెం కాదుగా యిది లక్షలు... వాటితో అతని ఇద్దరి అమ్మాయిల పెళ్ళి ఘనంగా చేసి, భార్య ఆరోగ్యం బాగుచేయించి, స్వంత రిక్షా కొని హాయిగా బ్రతికే అవకాశం వాడిది... మధ్యలో నేనెవర్ని. లాడ్జిలో కూర్చొని ఆలోచిస్తున్నాడు రాజు 'సిగరెట్' వెలిగించి.

ట్రైన్‌కు టైం దగ్గర పడుతుంది. బ్రీఫ్‌కేస్ సర్దుకున్నాడు. రాత్రి త్రాగడం వలన తల పట్టేసింది, రూంబాయ్‌ని పిలిచి తర్వాత ట్రైన్‌కెళ్ళొచ్చని మందు తెప్పించుకున్నాడు రాజు.

రూములో ఒక్కడే నిదానంగా త్రాగుతూ, సిగరెట్ వెలిగించి, పొగను రింగులు రింగులుగా వదులుతూ, మళ్ళీ ఆలోచించసాగాడు-

లాటరీ టికెట్ మార్చిన సంగతి తనకు తప్ప ఎవరికీ తెలియదు, తనేమి సత్యహరిశ్చంద్రుడ్ని కాను, రిక్షావాలా దరిద్రం అంత తొందరగా పోతుందా? వాడు రిక్షా లాగి సంపాదించి కుటుంబాన్ని పోషించుకోవడం అలవాటు. వాడు అది తప్ప వేరే చేసి బ్రతకలేడు. నేను మాత్రం యీ వుద్యోగానికి అలవాటుపడి, కష్టమైన పని చేయగలనా?...! లాటరీ డబ్బు గురించి నాకిన్ని ఆలోచనలెందుకో. యీ విషయంలో ఎవరినైనా సలహా అడిగితే, అమ్మో యింకేమైనా వుందా? అందరికి తెలిస్తే నన్నెంత అసహ్యంగా చూస్తారు...!...?

మళ్ళీ మందు తెప్పించుకున్నాడు రాజు, భోంచేసి పడుకున్నాడు.

నిద్ర లేచేసరికి సాయంకాలం ఆరు గంటలైంది. ట్రైన్ టైమ్ దగ్గర పడడంతో, రూం కాళీ చేసి, బ్రీఫ్‌కేస్, బట్టల పాకెట్‌తో లాడ్జి బయట నిలబడి ఏదైనా రిక్షా దొరుకుతుందని ఎదురు చూస్తుండగా. రిక్షా అతని ముందు ఆగింది. ఆశ్చర్యం, వుదయం తానొచ్చిన రిక్షా... గిల్టీ ఫీలయ్యాడు రాజు. వెంటనే సర్దుకొని రిక్షాలో బ్రీఫ్‌కేస్, పాకెట్ పెట్టి కూర్చున్నాడు. ఛీ -నా సంతోషాన్ని భంగంచేయాలనే ఈ రిక్షావాలా తనను వెంటాడుతున్నాడు. ఒకవేళ వాడి టికెట్ నేను కాజేశానని వాడికి తెలిసిపోవలేదు కదా...! వాడి మొహం, వాడికి ఆ విషయం తెలిస్తే వుదయంనుండే నా గురించి వెదికేవాడే...? ఏమో అసలే మాస్ నేనెక్కిన రిక్షాని నేరుగా ఏదైనా పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్ళి అప్పచెపితే...! ఛీ, అన్ని వింత ఆలోచనలు. వాడికి ఆ యోగం వుంటే టికెట్ వాడికే దక్కేది, నాదగ్గరకే ఎందుకు చేరుతుంది...! అంతా నా భ్రమ.

ఏవయ్యా యీరోజు బాగా గిట్టుబాటైందా? అడిగాడు రాజు రిక్షా వాలాని.

ఏదో మీ దయవల్ల వంద రూపాయలు సంపాదించా బాబు...! సంతోషంతో చెప్పాడు రిక్షావాడు.

అయితే యీరోజు పండగేనన్నమాట?

మీ బోణీ మంచిదే బాబు, అన్నాడు రిక్షావాలా.

బాబు ఓసారి ఎవరో మహానుభావుడు నా రిక్షా ఎక్కి దిగిపోయేటప్పుడు బ్యాగు మర్చిపోయాడు. నేను దాన్ని తెరిచి చూసేసరికి, దాన్లో కట్టల కట్టల కొత్త నోట్లున్నాయి బాబు. ఆ డబ్బు నేను నా జన్మలో కాదు కదా కలలో కూడా చూసెరగను. ఏంచేయాలో అర్థంకాలేదు...! నాతోపాటు రిక్షా లాగే మా వాళ్ళిద్దరికి, ఆరాటం ఆపుకోలేక చెప్పాను బాబు.

వాళ్ళు అది విని, ఒరేయ్ నీ అంతటి అదృష్టవంతుడు లోకంలో ఎవరూ లేరు... నీ కష్టాలన్నీ గట్టెక్కాయి. పదరా మందు కొడదాం అన్నాడు బాబు.

నాకు భయమేసింది బాబు, పాపం అతను ఏ పని గురించి అంత డబ్బు తెచ్చాడో, అది అతని స్వంతమో, లేక అప్పుతెచ్చాడో...! అమ్మాయి పెళ్ళి గురించో లేక వాళ్ళావిడ ఆరోగ్యం గురించో...? యిది పోగొట్టుకొని అతనేదైనా అఘాయిత్యానికి పాల్పడితే...? ఏమో...? యీ డబ్బు నాది కాదు, నాకెందుకు వచ్చిన తంటా అనుకొని, నేరుగా దగ్గరలోవున్న పోలీసుస్టేషన్‌కెళ్ళాను బాబు చెప్పసాగాడు రిక్షావాలా.

తనకెందుకు యిదంతా, త్వరగా స్టేషన్ వస్తే బాగుండు... ఒకవేళ వీడు, నానుండి నిజం రాబట్టడానికి యీ నీతి కథ చెపుతున్నాడా? ఏమో వాడి తెలివి వాడిది... ఆలోచిస్తున్నాడు రాజు.

బాబు- వింటున్నారా? నేను పోలీసుస్టేషన్‌కు వెళ్ళేసరికి. బ్యాగు మర్చిపోయిన ఆ బాబుగారు అక్కడే వున్నాడు బాబు, అతను డబ్బు మర్చిపోయి తాను పోగొట్టుకున్న డబ్బు దొరుకుతుందో లేదోనని ఏడ్చి ఏడ్చి కళ్ళు ఎర్రబడ్డాయి బాబు. అతను నన్ను చూడగానే పరుగెత్తుకొని నా రిక్షా దగ్గరకు వచ్చాడు బాబు. నా చేతిలో అతని బ్యాగు చూసి ఆశ్చర్యపడ్డాడు. నేను లోపలికెళ్ళి ఎస్ఐగారి టేబుల్‌పై బ్యాగు పెట్టి జరిగింది చెప్పాను బాబు.

ఎస్ఐ గారు, ఆ బ్యాగు తెరచి చూసి ఆశ్చర్యపోయాడు. బ్యాగు పోగొట్టుకున్న బాబుగారిని 'ఎంతుండాలని' అడిగారు బాబు.

బ్యాగు తీసుకొని చూసి, సార్ యాభైవేలు, కరెక్ట్‌గానే వున్నాయి. అమ్మాయి పెళ్ళికని ఓ తెలిసిన ఫ్రెండ్‌వద్ద అప్పుగా తీసుకొని వుదయం యితడి రిక్షా ఎక్కి పొరపాటుగా బ్యాగు మర్చిపోయి, రిక్షా దిగి వెళ్ళిపోయాను.

(మిగతా 27వ పేజీలో)


# సైన్స్ గ్రిప్

-సి.వి.సర్వేశ్వర శర్మ

## మనిషి తెలివి పెరిగే మార్గాలున్నాయా?

రసాయనాలు ఆధారంగా ఎన్నో ప్రయోజనాలు సాధిస్తున్న యుగంలో ఉన్నాం. చాలా రోగాలు రసాయనాలకు నయం అవుతున్నాయి. మనం వాడుతున్న ఔషధాలన్నీ రసాయన పదార్థాల సమ్మేళనాలే.

వ్యవసాయంలో పంటలను చీడ, పీడల నుండి రక్షించడానికి, అధిక దిగుబడులు సాధించడానికి రసాయనాలు ఎంతగానో వినియోగపడుతున్నాయి. రోజురోజుకి రసాయనాల పనితీరుపై మనిషికి మరింత అధికంగా నమ్మకం పెరుగుతోంది. శాస్త్రవేత్తలు గత మూడు వందల సంవత్సరాలుగా రసాయనాలతో ఊహాతీతమైన విజయాలు సాధించారు.



రసాయనాలు ఆసరాచేసుకుని మెదడుచేసే పనులపై పెత్తనం చెలాయించాలనే ప్రయత్నంలో శాస్త్రవేత్తలు ఉన్నారు. ఈ పని సానుకూలతకు ఇప్పటికే కొన్ని హార్మోనులను గుర్తించి వాటితో మెదడుపై ప్రయోగాలు చేస్తున్నారు.

ఈ హార్మోనులు శరీరం పెరుగుదలను అదుపులో ఉంచడమే గాక ఇంకా ఇతరములైన అనేక జీవ వ్యాపారములపై అజమాయిషీ చేయగలవు. ఇప్పుడు ఈ హార్మోనులను ఉపయోగించి పరిశోధకులు శరీరంలోని భాగాలలో కావలసిన మార్పులను తీసుకువచ్చే ప్రయత్నంలో వున్నారు.

ఈ హార్మోనుల కారణంగా మనిషి రోగాల బారిన పడకుండా కాపాడడం, శరీరానికి మరికొంత బరువును సమకూర్చడం, ఇంకా మనిషి తెలివితేటల్ని కూడా పెంచడంలో సఫలీకృతులు కావచ్చునని ఆశిస్తున్నారు.

జంతువులపై ప్రయోగాలు చేస్తున్నారు. వాటికి పిట్యూటరీ గ్రోత్ హార్మోన్ ఇచ్చారు. ఈ హార్మోన్ ప్రోటీన్ ఉత్పత్తిని పెంచి శరీరంలో నైట్రోజన్ అధికంగా ఉండేటట్లు చేస్తుంది.

శరీరంలో అధికంగా నైట్రోజన్ ఉంటే, శరీర కణాల నిర్మాణానికి కావలసిన నైట్రోజన్ సంబంధిత పదార్థాల ఉత్పత్తి పెరుగుతుంది. అంటే న్యూక్లిక్ ఆమ్లాలు వంటి వాటి ఉత్పత్తి హెచ్చవుతుంది.

చూడుతో వున్న ఎలుకలకు బొవైన్ పిట్యూటరీ గ్రోత్ హార్మోన్‌ను వాటికి గర్భం ధరించిన 7వ రోజు మొదలు 20వ రోజు వరకు ఇచ్చారు. పెద్ద ఎలుకల్లో ఉత్పత్తి అయ్యే హార్మోను పరిమాణానికి మూడు రెట్లు అధికంగా ఈ హార్మోన్‌ను ఇంజక్షన్ ద్వారా ఇచ్చారు.

ఎలుకల బరువు పెరగలేదు కాని వాటి మెదడు బరువు పెరిగింది. మెదడులో ఉండే కణాల సంఖ్య పెరగడంవల్లనే మెదడు బరువు పెరిగింది. ఈ హార్మోన్ మనుషులకు ఇస్తే ఫలితాలు తెలివి పెరగడంతో సరిపెడతాయా లేక ఇతర సమస్యలు చోటుచేసుకుంటాయా అనే విషయాలు తెలియాల్సి ఉంది. ★

**రసాయనాలు ఆసరా చేసుకుని మెదడుచేసే పనులపై పెత్తనం చెలాయించాలనే ప్రయత్నంలో శాస్త్రవేత్తలు ఉన్నారు. ఈ పని సానుకూలతకు ఇప్పటికే కొన్ని హార్మోనులను గుర్తించి వాటితో మెదడుపై ప్రయోగాలు చేస్తున్నారు.**

---

*(9వ పేజీ తరువాయి)*

కాసేపటికి గుర్తొచ్చి, ఏంచేయాలో అర్థంకాక, రిక్షా గురించి వెదికి, లాభం లేదని మీ దగ్గరకొచ్చి రిపోర్టిద్దామనుకునేసరికి, నా పిల్లల అదృష్టంకొద్ది నా బ్యాగు నాకు దొరికింది సార్... అన్నాడు బాబు.

వెంటనే ఎస్ఐగారి ముందు నాకు అయిదువందలు బహుమతిగా యివ్వబోయాడు సార్, నేను వద్దని ఎంత బ్రతిమాలినా ఎస్ఐగారు తీసుకో నీలాంటి నిజాయితీపరులు యీరోజుల్లో వుండడం అతని అదృష్టం- తీసుకో అన్నాడు.

"వద్దు బాబు, నేను కష్టపడిందే నాకు చాలు. అన్నాను. వాళ్ళు ఎంత వద్దన్నా వినకుండా అతి బలవంతంగా యిచ్చారు. ఆ డబ్బు తీసుకొని యింటికెళ్ళేసరికి మా ఆవిడ అనుకోకుండా కళ్ళు తిరిగి పడిపోతే ఆస్పత్రిలో చేర్పించారని తెలిసింది. నేను ఆస్పత్రికి వెళ్తే దాదాపు పదిహేను వందలు మందులకు డాక్టర్లకు ఖర్చు అయ్యాయి బాబు."

"వద్దు బాబు, మన కష్టానికి తగ్గ డబ్బు చాలు. ఎక్కువ తీసుకోవడంవలన ఎదురయ్యే కష్టాలు భరించలేము. అన్యాయంగా వద్దు బాబు" వేదాంతిలా అన్నాడు రిక్షావాడు.

రైల్వేస్టేషన్ వచ్చేసరికి రిక్షా ఆగింది. రాజు రిక్షా దియి రిక్షా కిరాయి యిచ్చి తన బ్రీఫ్ కేస్, బట్టల పాకెట్ తీసుకొని రైలెక్కాడు. విజయవాడలో ట్రైన్ దిగి యింటికెళ్ళాడు.

**"వద్దు బాబు, నేను కష్టపడిందే నాకు చాలు. అన్నాను. వాళ్ళు ఎంత వద్దన్నా వినకుండా అతి బలవంతంగా యిచ్చారు. ఆ డబ్బు తీసుకొని యింటికెళ్ళేసరికి మా ఆవిడ అనుకోకుండా కళ్ళు తిరిగి పడిపోతే ఆస్పత్రిలో చేర్పించారని తెలిసింది. నేను ఆస్పత్రికి వెళ్తే దాదాపు పదిహేను వందలు మందులకు డాక్టర్లకు ఖర్చు అయ్యాయి బాబు."**

రాజు కాలకృత్యాలు తీర్చుకొని, ముందుగా ఆఫీసుకెళ్ళి, తర్వాత లాటరీ టికెట్ గురించి ప్రయత్నించాలని రాజు యింట్లోనుండి బయలుదేరాడు.

ఆఫీసుకెళ్ళిన రాజు తాను హైదరాబాద్ వెళ్ళిన పని గురించి బాస్‌తో మాట్లాడి, బయటకు వచ్చి తన సీట్లో కూర్చొని ఆ రోజు పేపరు తిరగేస్తూ 'టీ' త్రాగుతున్నాడు.

పేపర్లో లాటరీ కాలంలోవున్న వార్త చదివాడు. దాన్లో "గమనిక, నిన్నటి పేపర్లో రాజ్యలక్ష్మి లాటరీ ఫలితాల్లో ఫస్ట్ ప్రైజ్‌గా ప్రకటించిన టికెట్ నంబరు 123456789 పొరపాటుగా ప్రచురించాము. ఫస్టు ప్రైజ్ పొందిన టికెట్ నంబరు 12547698గా సరిచూసుకోవల్సినదిగా కోరుచున్నాము. జరిగిన పొరపాటుకు చింతిస్తున్నాము"- ఎడిటర్. యిది చదివిన రాజుకు పిచ్చెక్కింది జుట్టు పీక్కున్నాడు రాజు.

ఆ నంబరు నేను కొన్న టికెట్‌దే- రిక్షావాడి టికెట్‌కు ప్రైజ్ వచ్చిందని తెలిసే, కావాలని టికెట్స్ మార్పు చేశాను. ఎన్నో కలలు కన్నాను. లాటరీ ప్రైజ్ వచ్చిందని ఆఫీసు డబ్బు దాదాపు అయిదువేలు ఖర్చుచేసి అందరికి బట్టలు కొన్నాను, జల్సా చేశాను... ఆ డబ్బు ఆఫీసులో ఎలా కట్టాలి...! ఏం చేయాలి...! ఆలోచన్లో పడ్డాడు రాజు, "చేజారిన అదృష్టాన్ని" తలుచుకుంటూ ఏడ్చాడు.

★